అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 09 ఆగష్టు 2024 పేజీలు : 04

ఏబి-పిఎంజెఏవై కింద

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కువ కేసులకు వైద్యం అందించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త**

ఏబి-పిఎంజెఏవై కింద ప్రభుత్వాసుపత్రుల్లో ఎక్కువ కేసులకు వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆయుష్మాన్ భారత్ ప్రధాన్‌మంత్రి జన్‌ఆరోగ్య యోజన కింద ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ మీటింగ్‌ను జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆయుష్మాన్ భారత్ ప్రధాన్‌మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద 6,76,813 మంది లబ్దిదారులకు ఎన్రోల్ చేయాల్సి వుండగా ఈ ఏడాది మార్చి 15వతేదీ వరకు 6,27,041 మంది లబ్దిదారులను నమోదు చేయడం జరిగిందని, 92.6 శాతం నమోదు పూర్తయిందని పూర్తిస్థాయిలో లబ్దిదారుల నమోదు చేపట్టాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్ కార్డుకు సంబంధించి ప్రత్యేకంగా ఎన్రోల్మెంట్ చేయడం ద్వారా దేశ వ్యాప్తంగా వైద్యసేవలు పొందేందుకు అవకాశం వుంటుందని ఏబి-పిఎంజెఏవై కింద లబ్దిదారుల నమోదు, కార్డుల మంజూరుపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలోని అన్ని పిహెచ్‌సిలను ఎంపానల్మెంట్ పూర్తి చేయాలన్నారు. ఏబి-పిఎంజెఏవై కింద ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్కువ కేసులను తీసుకోవడంపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

**జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశం నిర్వహణ :**

అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవకు సంబంధించి డిస్ట్రిక్ డిసిప్లినరీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని సాయిరత్న ఆసుపత్రిలో వైద్యసేవకు సంబంధించి గార్లదిన్నె మండలం కల్లూరు గ్రామానికి చెందిన చిదంబరయ్య, వరలక్ష్మి అనే దంపతులు ఫిర్యాదు చేయగా డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య ఆసుపత్రులు, నెట్వర్క్ ఆసుపత్రుల కమిటీ ఆధ్వర్యంలో ఈ విషయమై విచారణ చేయడం జరిగిందని జిల్లా డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ కో ఆర్డినేటర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాయిరత్న ఆసుపత్రిపై 80 రూపాయల ఫెనాల్టీ వేసి చిదంబరయ్యకు అందచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిపుణుల కమిటీ సూచించిన మేరకు చిదంబరయ్యకు సాయిరత్న ఆసుపత్రిలో ఉచితంగా ఫిజియోథెరపి చేయించాలని ఆదేశించారు. జిల్లాలోని ఏ ఆసుపత్రుల్లోనైనా మధ్యవర్తులను అనుమతించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్, సిహెచ్‌సి ఏరియా ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవకు సంబంధించి డాక్టర్ వైద్యసేవ ఆసుపత్రులు, నెట్వర్క్ ఆసుపత్రుల్లో ఏ విధమైన ఫిర్యాదు వున్నా జిల్లా డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ కో ఆర్డినేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫోన్ నెంబర్ 08554-247266కు ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్యసేవ కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, డిపిఎం రవిశంకర్, జిల్లా డిసిప్లినరీ కమిటీ మెంబర్ డాక్టర్ లక్ష్మణ్‌ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

# అనంత తహశీల్దార్ కార్యాలయంలో గందరగోళం

- అర్బన్, రూరల్‌లకు ఒకే భవనం కేటాయింపు
- అర్బన్ కార్యాలయానికే గుంపుగుంపులుగా ప్రజలు
- రూరల్‌లో తహశీల్దార్, ఆర్ఐలు లేక పెండింగ్‌లో పనులు
- అన్నీ తెలిసినా స్పందించని ఉన్నతాధికారులు

**అనంతపురం, ఆగస్టు 8, ప్రభాతవార్త ప్రతినిధి**

అనంతపురం అర్బన్, రూరల్‌కు చెందిన తహశీల్దార్ కార్యాలయాలు ఒకే భవనంలో ఉంటుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కార్యాలయంలో ఎక్కడ ఏ అధికారి ఉంటున్నారు... ఏదీ అర్బన్, రూరల్ కార్యాలయం, ఏ అధికారిని ఏ పని కోసం సంప్రదించాలో తెలియక ప్రజలు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్జీలను సమర్పించేందుకు వచ్చిన ప్రజలు తికమక పడాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతపురం రూరల్‌కు అయితే తహశీల్దార్ విధుల్లో చేరలేదు. కనీసం ఆర్ఐ కూడా లేకపోవడంతో పలు సమస్యలు కూడా అలాగే ఉంటున్నాయి. సర్టిఫికేట్ల కోసం, ఇతర పనుల కోసం వచ్చిన ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అందరూ అర్బన్ కార్యాలయం వైపునకు వస్తుండడంతో ఏ సమస్యను ఎవరికి అడగాలో తెలియక ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు.




**ఒకే భవనంలో రెండు తహశీల్దార్ కార్యాలయాలు...**

ఒకే భవనంలో అనంతపురం అర్బన్, రూరల్ తహశీల్దార్ కార్యాలయాలు నడుస్తున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనంతపురం రూరల్‌కు, అర్బన్‌కు వేర్వేరు భవనాలు కేటాయించలేదు. ఒకే భవనంలో ఉంటుండడంతో అక్కడకు వచ్చే ప్రజలు ఏది అర్బన్ కార్యాలయం, రూరల్ కార్యాలయం అన్నది తెలీక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూరల్ తహశీల్దార్ కార్యాలయానికి గ్రామస్తులు, రైతులు ఎక్కువగా వస్తారు. అర్బన్ తహశీల్దార్ కార్యాలయానికి నగర వాసులు, సర్టిఫికేట్ల కోసం విద్యార్థులు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ఒకే భవనంలో రెండు తహశీల్దార్ కార్యాలయాలు ఉంటుండడంలో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూరల్‌కు తహశీల్దార్ ఇంకా బాధ్యతలు చేపట్టలేదు. ఆర్ఐ కూడా లేకపోవడంతో చాలా వరకు పనులు ఆగుతున్నాయి. గతంలో శింగనమల తహశీల్దార్‌గా పని చేసిన ఈశ్వరమ్మ రూరల్ తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. లేదా గతంలో పని చేసిన మోహన్‌కుమార్ కూడా తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టవచ్చు. మోహన్‌కుమార్ కూడా ఇంకా కూడేరులో బాధ్యతలు చేపట్టకపోవడం గమనార్హం. రూరల్‌కు ఆర్ఐ లేకపోవడం కూడా ఒక సమస్యగా మారింది. కనీసం అర్బన్ ఆర్ఐకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు ఇచ్చినా, లేదా నూతనంగా ఆర్ఐను నియమించినా చాలా వరకు సమస్యలు తగ్గుతాయి. ఒక పక్క తహశీల్దార్, మరో పక్క ఆర్ఐ లేకపోవడంతో రూరల్‌లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ప్రజలంతా ఒక్కసారిగా అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వైపునకు వస్తుండడంతో ఆయా తహశీల్దార్ కార్యాలయాల విధులు గందరగోళంగా మారింది. అర్బన్ ప్రజలకు ఈ కార్యాలయ భవనం సరిపోతోంది. రూరల్ ప్రాంత వాసులకు మాత్రం ఏమాత్రం సరిపోవడం లేదు. వేర్వేరు భవనాలు కేటాయించాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యంలో అనంతపురం అర్బన్, రూరల్ తహశీల్దార్ కార్యాలయాలకు ఒకే భవనం కేటాయించడంతో అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రూరల్ తహశీల్దార్ కార్యాలయానికి భవన సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

# ఉన్నత ఆశయాలతో జీవించిన వ్యక్తి ఎంవి.రమణ

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- రమణ పార్థివ దేహాన్ని అనంతపురం మెడికల్ కాలేజీకి అప్పగింత



ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లకు రమణ పార్థివ దేహాన్ని అందజేస్తున్న సిపిఐ కార్యదర్శి రామకృష్ణ, నాయకులు, కుటుంబ సభ్యులు



రమణ అంతిమ యాత్రలో పాల్గొన్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జగదీష్, రామచంద్రయ్య, జాఫర్ తదితరులు



అనంతపురం అర్బన్ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**అనంతపురం, ఆగస్టు 8 ప్రభాతవార్త బ్యూరో**

మనిషి జీవించి ఉండగా ప్రజల కోసం పని చేయడమే కాకుండా ఉన్నతమైన ఆశయాలతో తాను మరణించిన తర్వాత పరోక్షంగా సమాజానికి ఉపయోగపడాలనే ఆలోచనతో చివరి కోరికగా తాను మరణించినా తర్వాత తన పార్థివ దేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించాలని ఆయన ఆశయం చాలా గొప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి దివంగత ఎంవి.రమణ పార్థివ దేహాన్ని అనంతపురంలో సిపిఐ పార్టీ కార్యాలయం నుంచి సిపిఐ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఊరేగింపుగా ప్రభుత్వ మెడికల్ కళాశాలకు చేరుకొని అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాదడుతూ.. విద్యార్థి దశ నుంచి మరణించేంత వరకు పార్టీ సిద్ధాంతాన్ని కట్టుబడి ప్రజల కోసం సేవ చేసిన వ్యక్తి అన్నారు. ఆయన అశయ, సిద్ధాంతాలను ముందుకు తీసుకొని పోయే విధంగా పని చేయాలని కార్యకర్తలకు రామకృష్ణ పిలుపునిచ్చారు. తండ్రి కోరికను గౌరవించి ఎం.వి.రమణ పార్థివ దేహాన్ని మెడికల్ క ళాశాలకు అందజేసిన ఆయన కుమారుడు వేణుగోపాల్, కోడలు సునీతల మనోధైర్యాన్ని అభినందిస్తున్నామన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మాణిక్యరావు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ కేఎస్ఎష్ వెంకటేశ్వరరావు మెడికల్ కళాశాల విద్యార్థులకు ఉపయోగపడేలా ఎం.వి.రమణ పార్థివ దేహాన్ని అందించిన రమణ కుటుంబ సభ్యులకు, సిపిఐ నాయకులకు డాక్టర్లు కృతజ్ఞతలు తెలియజేశారు.

రాష్ట్ర సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ మాట్లాడుతూ.. కామ్రేడ్ రమణ విద్యార్థి దశ నుండే కమ్యునిస్టు పార్టీ ఆశయాలను అనుసరిస్తూ సమాజ సేవకు తన జీవితాన్ని అంకితం చేశామన్నారు. రాష్ట్ర సిపిఐ కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య మాట్లాడుతూ.. భారత కమ్యునిస్టు పార్టీ ఆశయాలను రమణ బతికి నంత వరకు పాటించడమే కాకుండా విలువలతో కూడిన వాటిని కార్యకర్తలకు బోధించు వారని రమణ గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పార్టీ సేవలందించారని రామచంద్రయ్య కొనియాడారు. వైసీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, అనంతపురం మేయర్ వసీం, సీనియర్ జర్నలిస్టు తలారి రామాంజినేయులు, సిపిఐ రాష్ట్ర వర్గ సభ్యులు కె.రామాంజినేయులు, అనంతపురం సత్యసాయి జిల్లాల కార్యదర్శులు సి.జాఫర్, ఎం.వేమన్న యాదవ్, సిపిఎం రాష్ట్ర నాయకులు జి.ఓబులు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానందలు మాట్లాడారు. రమణ అంతిమ యాత్రలో కర్నూలు జిల్లా సిపిఐ నాయకులు భీమలింగప్ప, నంద్యాలజిల్లా సిపిఐ కార్యదర్శి రంగనాయుడు, నాయకులు నబీరసూలు, రాధాకృష్ణ, కడప జిల్లా సిపిఐ కార్యదర్శి గాలి చంద్రా, కడప సిపిఐ నాయకులు రామయ్య, నాగ సుబ్బారెడ్డి, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కిలెనిన్‌బాబు, అనంతపురం జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శిలు పి.నారాయణస్వామి, ఎల్.మల్లికార్జున, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.డి.సంజీవప్ప, జె.రాజారెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యులు బి.రమణయ్య, సి.లింగమయ్య, టి.రంగయ్య, ఎన్.శ్రీరాములు, బి.గోవింద్, పి.రామకృష్ణ, గుంతపల్లి గోపాల్, బి.కేశవరెడ్డి, టి.కత్తినారాయణస్వామి, వీరభద్రస్వామి, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు శ్రీశైలం రాజేష్‌గౌడ్, నాయకులు వి.కె.కృష్ణుడు, ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శి ఆనంద్, సంతోష్ ,రైతు సంఘం నాయకులు బండి రామకృష్ణ, మహిళా సమాఖ్య నాయకురాలు ఆర్.అమీనా, వరలక్ష్మి, పద్మావతి, పార్వతీ ప్రసాదు, రాజేష్ కాలనీ సర్పంచు డి.ఆశాబి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, రాప్తాడు నియోజకవర్గం, శింగనమల, గుత్తి నియోజకవర్గాల నుంచి సిపిఐ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# పైలా నరసింహయ్య బిజెపిలో చేరిక

- మొన్ననే వైసీపీకి రాజీనామా



బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆధ్వర్యంలో బిజెపిలో చేరిన పైలా నరసింహయ్య

**అనంతపురం, ఆగస్టు 8 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం వైసీపీ జిల్లా మాజీ అధ్యక్షులు పైలా నరసింహయ్య బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆధ్వర్యంలో గురువారం విజయవాడలో చేరారు. ఇటీవల పైలా నరసింహయ్య వైసీపీ పార్టీకి, వైసిపి జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. మూడు రోజుల్లోనే బిజెపిలో చేరడం విశేషం. ఇటీవల జరిగిన శాసన సభ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల తరుపున జోరుగా ఎ న్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పని చేశారు. వైసీపీ పార్టీలో జిల్లా అధ్యక్షులుగా గుర్తింపు లేదని అసంతృప్తి పైలా నరసింహయ్యలో కనిపించేది. అయితే ఎప్పుడు బహిరంగంగా వ్యాఖ్యానించలేదు. ఇదిలా ఉండగా గతంలో తాడపత్రి నియోజకవర్గంలో నుంచి జనసేన అభ్యర్థిగా, సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసిన విషయం తెలిసిందే.

# పేదరికం కారణంగా బడి మానివేయకూడదనే మధ్యాహ్న భోజనం అమలు

- జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేస్తున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్

**శ్రీసత్యసాయిజిల్లా, ఆగస్టు 08, ప్రభాతవార్త ప్రతినిధి:**

పేద పిల్లలు తమ పేదరికం కారణంగా బడిమానివేయరాదనే ఉద్దేశ్యంతోనే ప్రభుత్వం మధ్యాహ్నభోజన పథకంను అమలు చేస్తోందని శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నందు మధ్యాహ్నభోజన పథకాన్ని కలెక్టర్ పరిశీలించారు.

ఈ సందర్భంగా మధ్యాహ్నభోజనం ఎనూను పరిశీలించి విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నదని, ఇందులో అన్ని పనిదినాలలో విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత భోజనం అందిస్తారన్నారు. పాఠశాలలో బాలబాలికల ఆకలి తీర్చడం, పాఠశాలకు చేరేవారి సంఖ్యను, హాజరు శాతం పెంచడం ఈ పథకం ముఖ్యఉద్దేశ్యమన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ మధ్యాహ్నభోజన పథకంకు డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనంగా పేరుమార్చిందని, దీనిని పటిష్టంగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం సోమవారం కూరగాయల పలావ్, కోడిగుడ్డు కూర, వేరుశనగ బెల్లం చిక్కీ, మంగళవారం పులిహోర, దొండకాయపచ్చడి, ఉడికించిన గుడ్డు, రాగిజావ, బుధవారంకూరగాయల అన్నం, ఆలూ కుర్మ, ఉడికించి గుడ్డు, వేరుశనగ బెల్లం చిక్కీ, గురువారం సాంబార్‌బాత్, లేదా లెమన్ రైస్, టమోట పచ్చడి, ఉడికించిన గుడ్డు, శుక్రవారం అన్నం, ఆకుకూరపప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ బెల్లం చిక్కీ, శనివారం ఆకుకూర అన్నం, పప్పుచారు, రాగిజావ, స్వీట్ పొంగల్ అందించాలన్నారు. అనంతరం ఉన్నత పాఠశాల ఆవరణంలో న్యూటన్ గార్డెన్‌ను కలెక్టర్ పరిశీలించి, విద్యార్థులకుకొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో ఒక గంట న్యూట్రీషియన్ గార్డెన్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తాం

- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



కాలువకు రాళ్లు అడ్డుపడిన దృశ్యంను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



వానలో సైతం హెచ్ఎల్‌సి కెనాల్‌ను రైతులతో కలిసి పరిశీలిస్తున్న దృశ్యం

**శింగనమల, ఆగస్టు 8 ప్రభాతవార్త**

హెచ్ఎల్‌సి ఆయకట్టు చివరి వరకు నీరు అందించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం ఆమె నియోజకవర్గ పరిధిలోని నార్పల మండలం వెంకటంపల్లి గ్రామం వద్ద హెచ్ఎల్‌సి కెనాల్‌ను రైతులతో కలిసి వర్షంలోనే నడుస్తూ కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో హెచ్ఎల్‌సి కాలువ మరమ్మత్తులు చేకపోవడంతో పెద్ద పెద్ద బండరాళ్లతో కాలువ మూసుకుపోయి నీరు వెళ్లడానికి అడ్డుగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం అధికారులతో మాట్లా డుతూ.. వెంటనే చివరి ఆయకట్టుకు నీరు అందించే విధంగా చర్య లు తీసుకోవాలని వీలైనంత త్వర గా కాలువ మరమ్మత్తులు చేపట్టాలని హెచ్ఎల్‌సి అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట టిడిపి నాయకులు ఆలం వెంకట నరసనాయుడు, ఆ పార్టీ కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.

# చోరీ కేసు ఛేదింపు..

- నలుగురు ముద్దాయిలు అరెస్టు
- నగదు, వెండి వస్తువుల స్వాధీనం
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ వి.రత్న



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ వి.రత్న

**కదిరి, ఆగస్టు 8 ప్రభాతవార్త**

కదిరి పట్టణంలోని బైపాస్ రోడ్డులోని యామని మెడికల్ షాపు యజమాని ఇంటిలో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 5వ తేదిన చోరీ జరిగిన ఈ సంఘటనకు సంబంధించి కదిరి డిఎస్‌పి శ్రీలత ఆధ్వర్యంలో పోలీసులు చోరీకి పాల్పడిన దొంగలను అరెస్టు చేశారు. గురువారం పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో జిల్లా ఎస్పీ వి.రత్న విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని నిజంవల్లి కాలనీకి చెం దిన షేక్ హైదరవలి (యామిని మెడికల్ స్టోర్‌లో పని చేసే వ్యక్తి) షేక్ అల్తా ఫ్, కె.దారి మహేష్ ఖాజా పీరాలు ఈ చోరీకి పాల్పడినట్లు వెల్లడించారు. ఇంటిలోని 11 లోల నగదు, మూడు కిలోల వెండి చెంబులు, వెండి వస్తువు లు, చోరీ చేసినట్లు పేర్కొన్నారు. నింధితులను సిసిటీవి ఫుటేజ్ ఆధారంగా చేపట్టి అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. నింధితుల వద్ద నుంచి రూ.10:30 లక్షల నగదు, 1.340 గ్రాముల నుంచి వస్తువులు, ఒక మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. కాగా ఈ నెల 5న మెడికల్ స్టోర్ యజమాని మధుసూధన్ ఆ వ్యక్తిగత పనుల నిమిత్తం బెంగుళూరుకు వెళ్లాడని, ఆ సమయంలో షాపులో వచ్చిన డబ్బు, కుమారుడి జీతం మొత్తం 11 లక్షలు నగుదును తన ఇంట్లో ఉన్న రూమ్‌లోని బీరువాలో భద్రపరిచి భార్య కళ్యాణి చెప్పే వెళ్లినట్లు తెలిపారు. 6న ఉదయం బీరువాను ఓపెన్ చేసి చూడగా తాను పెట్టిన నగదు కనిపించడం లేదని, మూడు కిలోల వెండి వస్తువులు సైతం చోరీకి గురైనట్లు పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయన ఫిర్యాదుమేరకు కదిరి డిఎస్పీ ఆధ్వర్యంలో సిఐ పుల్లయ్య ఎస్సై బాబ్జాన్లు నింధితులను బుధవారం పట్టణ సమీపంలోని మదనపల్లి రోడ్డులోని నేహా ఫంక్షన్ హాల్ వద్ద అరెస్టు చేశారు. హైదర్‌వలీ 10 సంవత్సరాలుగా మెడికల్ షాపులో పని చేస్తూ ఉన్నాడని చెడు వ్యసనాలకు బానిసై అప్పులు చేసి తన ఇ ద్దరు స్నేహితులతోపాటు, చోరీకి ప్లాపడ్డాడని, వీరికి షేక్ అల్తాఫ్ మామ ఖాజాపీరా సైతం వెండి వస్తువులను దాచుటకు సహకరించినట్లు తెలిపారు. నింధితులను అరెస్టు చేసిన డిఎస్పీ, సిఐ, ఎస్సైలు బాబ్జాన్, బలరామయ్య, జిల్లా సిసిఎస్ హెడ్‌కానిస్టేబుల్ విక్టరీ ఎస్‌బి టీం కానిస్టేబుల్ రామానుజులు హరినాథ్‌రెడ్డి, నాగరాజు, పైడి పట్టణ క్రైమ్ కానిస్టేబుల్ రాజప్ప, శివ శంకర్‌రెడ్డిలను జిల్లా ఎస్పీ అభినందించి రివార్డు ప్రకటించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఉంచామని నింధితులను కఠినంగా శిక్షిస్తామని ఎస్పీ హెచ్చరించారు. ఈ సమావేశంలో కదిరి డిఎస్పీ శ్రీలత, సిఐ పుల్లయ్య, ఎస్సైలు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా ప్రభుత్వ కార్యాలయాలకు కొనసాగుతున్న ఐఎస్ఒ 9001:2015 సర్టిఫికెట్ గుర్తింపు

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

02ATP08_02ATP08.qxd 08-08-2024 PM 11:03 Page 1



## హిందూపురం డిఎస్‌పిగా మహేష్



**హిందూపురం టౌన్, ఆగస్టు 8 ప్రభాతవార్త**

గుంటూరు పడమర నుండి హిందూపురం డిఎస్‌పిగా కెవి మహేష్‌ను బదిలీ చేస్తూ ఆ శాఖ అధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిఎస్‌పిల సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ వున్న డిఎస్‌పి కన్జక్షన్ బదిలీపై వెళ్లడంతో గుంటూరు పడమరలో విధులు నిర్వహిస్తున్న డిఎస్‌పి మహేష్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. త్వరలో ఆయన పదవీబాధ్యతలు చేపట్టనున్నారు.

## జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను ఇస్తాం

- ఎమ్మెల్యే పిఎ హామీ



వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**హిందూపురం, ఆగస్టు 8 ప్రభాతవార్త**

హిందూపురం పట్టణంలోని వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు సొంతింటి కలను స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహకారంతో మరో రెండు నెలల్లో సాకారం చేస్తామని టిడిపి నియోజకవర్గం సమన్వయకర్త శ్రీనివాసరావు అన్నారు. గత 20 సంవత్సరాల నుండి పట్టణంలో విధులు నిర్వహిస్తున్న జర్నలిస్టులు ఇంటి స్థలాలను కేటాయించాలని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం హిందూపురం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలను కేటాయించాలని కోరుతూ టిడిపి నియోజకవర్గం సమన్వయకర్త శ్రీనివాసరావుకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా హిందూపురం జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయింపు కోసం ప్రత్యేక జిఒను 2006లో ఇవ్వడం జరిగిందన్నారు. అయినప్పటికి నాటి నుండి నేటి వరకు ఇంటి స్థలాలను కేటాయించలేదన్నారు. 2014 టిడిపి అధికారంలోకి వచ్చి హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఇక్కడి నుండి శాసనసభ్యునిగా ఎన్నికైన సందర్భంలో ఇంటి స్థలాలను తప్పకుండా కేటాయిస్తామని హామి ఇవ్వడం జరిగిందన్నారు. అయినప్పటికి ఇప్పటి వరకు ఇంటి స్థలాలు కేటాయింపు జరగలేదన్నారు. ఇప్పటికైనా ప్రత్యేక చొరవ తీసుకుని జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ విషయంపై ఇప్పటికే ఎమ్మెల్యే బాలకృష్ణ చర్చించారని, ఆయన సూచనల మేరకు మరో రెండు నెలల్లో పట్టణంలో జర్నలిస్టులకు ఒకేచోట ఇంటి స్థలాలను కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆలయం భూమిపూజకు అందరూ ఆహ్వానితులే



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

**హిందూపురం టౌన్, ఆగస్టు 8 ప్రభాతవార్త**

హిందూపురం పట్టణ నడిబొడ్డున గాంధీచౌక్ వద్ద ఈ నెల 12న జరగనున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం నిర్మాణ భూమిపూజకు అందరూ ఆహ్వానితులేనని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధరదేవి చేతుల మీదుగా భూమిపూజ జరుగుతుందన్నారు. గురువారం మధ్యాహ్నం



విరాళం అందిస్తున్న పుల్లారెడ్డి

ఆలయం ప్రాంగణం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. దాదాపు 4 కోట్ల రూపాయల వ్యయంతో ఏడాదిలోపు నిర్మాణం పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా అయోధ్యలో రామాలయంలో మూలవిరాట్ రామ్ లీలా విగ్రహాన్ని రూపొందించిన మైసూర్‌కు చెందిన అరుణ్‌యోగిరాజ్ ఈ ఆలయంలో శ్రీనరసింహస్వామి విగ్రహాన్ని కూడా తయారు చేస్తున్నారన్నారు. ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న ఈ ఆలయం నిర్మాణంలో ప్రజలు తమవంతు అన్ని రకాల సహకారం అందించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు జెఇ వెంకటస్వామి, అధ్యక్షులు రాఘవేంద్ర, కార్యదర్శి నిమ్మకాయల రాము, చంద్రమోహన్‌యాదవ్, నెట్టెప్ప, అమర్నాథ్, ఆకుల సూర్యనారాయణ, రామాంజి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం కరపత్రాలను విడుదలు చేశారు. కాగా నిర్మాణానికి కాంట్రాక్టర్ పుల్లారెడ్డి 2,01,116 రూపాయలను అందించి ఆలయ శాశ్వత ట్రస్ట్ సభ్యత్వం పొందారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ ప్రజలు

**మడకశిర టౌన్, ఆగస్టు 8 ప్రభాతవార్త**

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు మండల పరిధిలోని జిల్లెడు గుంట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో గురువారాం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లీలావతి మాట్లాడుతూ.. పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లిపాలు పట్టడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి గర్భిణులు, బాలింతలకు వివరించారు. అలాగే బిడ్డకు 6 నెలలు పూర్తయ్యే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని, ఇతర ఎలాంటి పానీయాలు పెట్టకూడదని సూచించారు. తల్లిపాలు ఆవశ్యకతను తల్లులకు అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు పట్టవచ్చునని తల్లులకు సూచించారు. ఎక్కువగా ఆకుకూరలు తింటే ఆరోగ్యంగా ఉండడంతో పాటులోపల పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని తల్లులకు వివరించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి అశ్విని, అంగన్‌వాడీ వర్కర్లు గర్భిణీలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదానానికి విరాళం

**హిందూపురం టౌన్, ఆగస్టు 8 ప్రభాతవార్త**

సద్గురు శ్రీయోగినారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తునన అన్నదాన కార్యక్రమానికి హిందూపురం జనసేన ఇన్‌చార్జ్ ఆకుల ఉమేష్ గురువారం 5 వేల రూపాయలను విరాళంగా అందచేశారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నం వడ్డించారు. ఈ సందర్భంగా సేవా సమితి సభ్యులు ఆకుల ఉమేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



అన్నదానంలో పాల్గొన్న ఆకుల ఉమేష్

## గోరంట్ల పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు



ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్న దృశ్యం

**గోరంట్ల, ప్రభాతవార్త, ఆగస్టు 08**

గోరంట్ల పట్టణంలో వాహన చోధకులు నిబంధనలు పాటించకపోవడం వల్ల నిరంతరం ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో పట్టణ వాసులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గోరంట్ల మండల పరిధిలోని గ్రీన్ ఫీల్డ్ రోడ్డు, ముద్దనూరు- హిందూపురం, పుట్టపర్తి -కోడూరు రోడ్డు నిర్విరామంగా జరుగుతన్న సందర్భంలో భారీ వాహనాలైన సిమెంట్ ఐరన్ ఇతర వాహనాల, కియా అనుబంధ సంస్థలైన పలు కంపెనీల బస్సులు మరీ గార్మెంట్‌కి సంబంధించిన బస్సులు, పట్టణంలో నుండే వెళుతుండటంతో ఒక్కొక్కసారి గంటల తరబడి వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుకాణాల ముందు సిమెంట్, ఐరన్ లారీలు రోడ్డుపై నిలబడే అన్‌లోడ్ చేస్తున్నారు. ఇదేమిటని ప్రజలు అడిగితే మీకు ఇష్టమొచ్చిన వారి వద్ద చెప్పుకో మని దౌర్జన్యం చలాయిస్తున్నారు. ఇప్పటికైన పోలీస్ అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

## బాలుర హై స్కూల్ కమిటీ ఛైర్మన్‌గా నరసింహులు



నూతన కమిటీ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**గోరంట్ల, ప్రభాతవార్త,ఆగస్టు 08**

శ్రీ సత్యసాయి జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ ఆశీస్సులతో బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ కమిటీ ఛైర్మన్‌గా బీజేపీ జిల్లా దళిత మోర్చ ఉపాధ్యాక్షులు నరసింహులని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దీనికి సహకరించిన బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవితమ్మకి, టిడిపి మండల న్వీనర్ సోమశేఖర్‌కి పట్టణ అధ్యక్షులు నక్కల రఘునాథ్ రెడ్డికి కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిమ్మల యువశేఖర్, నిమ్మల శ్రీధర్, బీరే వేణుగోపాల్ రాయల్, జనసేన సరేష్, సంతోష్, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు బొట్టు ఎనివాసులు, ఈశ్వర్ రెడ్డి, వెంకటాచలం, బోయ లక్ష్మీనారాయణ, శంకర్, షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో 57 పాఠశాలకు ఎస్‌ఎంసి ఎన్నికలు ఏకగ్రీవం

**లేపాక్షి, ఆగస్టు 8 ప్రభాతవార్త**

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు లేపాక్షి గురుకుల పాఠశాల, కెజిబివి పాఠశాలలో ఎస్‌ఎంసి ఎన్నికలు గురువారం ఏకగ్రీవంగా జరిగాయి. మైదుగోళం ప్రాథమికోన్నత పాఠశాలలో 1 నుండి 5వతరగతి వరకు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కాగా 6,7,8 తరగతులకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావడంతో కోరం లేకుండా పోయింది. దీంతో మైదుగోళం ప్రాథమికోన్నత పాఠశాలల ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఇది ఇలా వుండగా నీలంసంజీవరెడ్డి జిల్లా పరిషత్ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో ఛైర్మన్ సోము, వైస్‌ఛైర్మన్‌గా శివమ్మ, వివేకానంద జిల్లా పరిషత్ పాఠశాలలో ఛైర్మన్ శంకరప్ప, వైస్‌ఛైర్మన్‌గా చన్నమ్మ, లేపాక్షి ఉర్దూ పాఠశాల ఛైర్మన్‌గా జబివుల్లాఖాన్, వైస్‌ఛైర్మన్‌గా నసీన, శనివారం ఉన్నత పాఠశాలలో ఛైర్మన్‌గా నరసింహమూర్తి, వైస్‌ఛైర్మన్‌గా అఖిలభాను, కొండూరు పాఠశాల ఛైర్మన్‌గా నాగరాజు, వైస్‌ఛైర్మన్‌గా లావణ్య, చోళసముద్రం ఉన్నత పాఠశాలలకు ఛైర్మన్లుగా చిన్నకృష్ణ, వైస్‌ఛైర్మన్‌గా రాధా, కులమతి ఉన్నత పాఠశాలకు ఛైర్మన్‌గా నరసింహమూర్తి, వైస్‌ఛైర్మన్‌గా ఆదిలక్ష్మిఅమ్మ, ఏపిఆర్‌ఎస్ గురుకుల పాఠశాల ఛైర్మన్‌గా షఫీవుల్లా, వైస్‌ఛైర్మన్‌గా నాగమణి, కెజిబివి పాఠశాల ఛైర్మన్‌గా రవి, వైస్‌ఛైర్మన్‌గా శోభ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాయిదా పడ్డ మైదోగోళం ఎస్‌ఎంసి ఎన్నికలు త్వరలో నిర్వహించనున్నట్లు ఎంఇఒ నాగరాజు తెలిపారు.

## ప్రశాంతంగా ముగిసిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు



పాఠశాల కమిటీల దృశ్యం

**అమరాపురం, ఆగస్టు 8 ప్రభాతవార్త**

ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 8 జిల్లా పరిషత్, ఉన్నత పాఠశాలలు, 3 ఎంపియుపి పాఠశాలలు, 46 ప్రాథమిక పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు, కెజిబివి పాఠశాల, అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఈ ఎన్నికలు జరిగాయి. ఇందులో అమరాపురం ఛైర్మన్‌గా వీరాపురం దేవరాజు, వైస్‌ఛైర్మన్ అమరాపురం భాగ్యమ్మ, హాలుకూరు ఛైర్మన్ దేవరాజు, వైస్‌ఛైర్మన్ చిట్టనడుకు గీత, కేశివరం ఛైర్మన్ మహేష్, వైస్‌ఛైర్మన్ లక్ష్మి, వలస ఛైర్మన్ కుమార్, వైస్‌ఛైర్మన్ కళ్యాణి, గౌడనకుంట ఛైర్మన్ వీరకేతప్ప, వైస్‌ఛైర్మన్ మహాదేవి, హేమావతి ఛైర్మన్ నాగేష్, వైస్‌ఛైర్మన్ లక్ష్మి, బయనపల్లి ఛైర్మన్ రంగస్వామి, వైస్‌ఛైర్మన్ మంజుల, వి.విగ్రహారం ఛైర్మన్ హనమంతరాయ, వైస్‌ఛైర్మన్ ఓబులమ్మ, ఆదర్శ పాఠశాల ఛైర్మన్ రాధమ్మ, వైస్‌ఛైర్మన్ పూజారి నాగప్ప, కెజిబివి పాఠశాల ఛైర్మన్ రంగమణి, వైస్‌ఛైర్మన్ శ్రీనివాసులు, బాలికల గురుకుల పాఠశాల ఛైర్మన్‌గా కవిత, వైస్‌ఛైర్మన్ వెంకటేష్, ప్రాథమికోన్నత పాఠశాలలు అమరాపురం ఛైర్మన్ హాసీనా, వైస్‌ఛైర్మన్ ఇలాహి, కెంకెర ఛైర్మన్ చిక్కన్న, వైస్‌ఛైర్మన్ మంజమ్మ, మిద్దె నిద్రగట్ట ఛైర్మన్ సిద్దేశ్వర, వైస్‌ఛైర్మన్ జ్యోతి ఎంపికైనట్లు ఎంఇఒ రాఘవయ్య తెలిపారు. అలాగే 46 ప్రాథమిక పాఠశాలల కమిటీల ఎంపిక జరిగింది. గౌడనకంట ఛైర్మన్‌గా ఈరలింగప్ప, వైస్‌ఛైర్మన్ పార్వతమ్మ, దేవగానపల్లిలో ఛైర్మన్ సిద్దేశ్వర, వైస్‌ఛైర్మన్ హనుమక్క, తమ్మడేపల్లి ఛైర్మన్ రాజప్ప, వైస్‌ఛైర్మన్ రేణుకమ్మ, వీరాపురం ఛైర్మన్ తిప్పేస్వామి, వైస్‌ఛైర్మన్ నాగమ్మ, నాగోనపల్లి ఛైర్మన్ అనిత, వైస్‌ఛైర్మన్ శాంతమ్మ, వలస ఛైర్మన్ తిప్పేస్వామి, వైస్‌ఛైర్మన్ లతమ్మ, చిట్టనడుకు ఛైర్మన్ శివకుమార్, వైస్‌ఛైర్మన్ అనుమక్క, ఉదుగురు ఛైర్మన్ తిప్పమ్మ, వైస్‌ఛైర్మన్ మేఘ, తదితర గ్రామాలతో పాటు మిగిలిన అన్ని ప్రాథమిక పాఠశాలలో కమిటీల ఎంపిక జరిగింది. ఆదర్శ పాఠశాలలో 450 మంది విద్యార్థులు వుండగా దాదాపు 359 మంది విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అమరాపురం ఎస్‌ఐ జనార్ధన్‌నాయుడు ఆధ్వర్యంలో ఎఎస్‌ఐ రామాంజినేయులు, హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. ఆయా పాఠశాలల పరిధిలో స్థానిక నాయకులు పాల్గొని కమిటీల ఎంపికకు సహకరించినట్లు ప్రిన్సిపాల్ ఓబుళపతి తెలిపారు.

## జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాం

- జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్



జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఎపియుడబ్ల్యూజె ప్రతినిధులు

**పుట్టపర్తి, ఆగస్టు 08, ప్రభాతవార్త**

శ్రీసత్యసాయి జిల్లాలో జర్నలిస్టుల సంక్షేమం, అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని శ్రీసత్యసాయిజిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ పేర్కొన్నారు. గురువారం ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ శ్రీసత్యసాయి జిల్లా శాఖ బృందం సభ్యులు కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్ నందు జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ టి.ఎస్.చేతన్‌ను కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ జర్నలిస్టు విన్నవించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజల సంక్షేమం, సమాజ హితం కొరకు అహర్నిశలు శ్రమించే జర్నలిస్టుల పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యందు ఉచిత విద్యకు అవకాశం కల్పించాలని కోరగా, త్వరలోను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పుట్టపర్తిలో ప్రెస్ క్లబ్ ఏర్పాటుకు స్థలం, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ళ పట్టాలు, తదితర అంశాలపై పరిశీలించి అవసరమైనచర్యలు తీసుకొని సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐజెయు నేషన్ కౌన్సిల్ సభ్యులు అయ్యన్నగారి శ్రీనివాసులు, ఎపియుడబ్ల్యూజె శ్రీసత్యసాయి జిల్లా కన్వీనర్ సి.పుల్లయ్య, సంఘం ప్రతినిధులు శంకర, కేశవ, రామాంజి, మురళి, బసప్ప, సాయికుమార్, ధరణి, నాగరాజు, రవికుమార్, శివసాయి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాను

- కమిటీ ఛైర్మన్ గరుగు మల్లికార్జున



కమిటీ ఛైర్మన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**ధర్మవరం రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త**

పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల చదువులకు తనవంతుగా నిరంతరం కృషి చేస్తానని గురుగుమల్లికార్జున తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొత్తపేటలో గల బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పాఠశాల కమిటీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్‌గా గురుగు మల్లికార్జునను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానంతరం కమిటీ ఏకగ్రీవ ఎంపికలో ఛైర్మన్‌గా మల్లికార్జున వైస్ ఛైర్మన్‌గా మంజులతోపాటు మరో 27 మంది కమిటీ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. ఈసందర్భంగా ఎంపికైన గురుగు మల్లికార్జునను ధర్మవరం బిజెపి అసెంబ్లీ ఇన్‌చార్జ్ హరీష్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ క ఆర్యక్రమంలో జింక చంద్రశేఖర్, సాకే ఓబులేసు, బిల్లే శీన, ఉపాధ్యాయుడు పెద్దారెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఎన్నిక



నూతనంగా ఎన్నికైన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ

**సోమందేపల్లి, ఆగస్టు 8 ప్రభాతవార్త**

మండలంలో గల 42 ప్రైమరీ పాఠశాలలు, 9 యుపి స్కూల్స్, 6 హై స్కూల్ ఒక కెజిబివి పాఠశాలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలు ఎన్నిక ప్రభుత్వ సూచనల మేరకు స్థానిక మండల విద్యాధికారి ఆంజనేయ నాయక్ సంబంధిత ప్రధాన ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 58 పాఠశాలలో ఎన్నికల నిర్వహించగా కేవలం మేకలపల్లి ఉన్నత పాఠశాలలో కోరం లేకపోవడం వల్ల ఎన్నికల న ఇలిచిపోవడం జరిగిందని అన్ని పాఠశాలలో సజావుగా ఎన్నికలు నిర్వహించడం జరిగిందని విద్యాధికారులు తెలియజేశారు. స్థానిక మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కురుబ ప్రభాకర్ ఛైర్మన్‌గా ఎన్నిక కావడం జరిగింది. రంగేపల్లి యూపీ స్కూల్‌లో ఉన్నత విద్యావంతుడు అయినటువంటి ఎం.ఎన్.శివశంకర్ ఎన్నిక కావడం, కస్తూర్బా గాంధీ పాఠశాలలో మహిళలకు అవకాశం ఇవ్వడం హర్షించ దగ్గ విషయమని ఉపాధ్యాయులు తెలియజేశారు. పాఠశాల ఛైర్మన్ ఎన్నికలలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు కన్వీనర్ సిద్ద లింగప్ప, నీరుగంటి చంద్రశేఖర్, మాజీ జడ్పిటిసి వెంకటరమణ, డివి ఆంజినేయులు, టౌన్ కన్వీనర్ వడ్డే సూరి, అన్ని పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి స్కూల్ కమిటీ నియామకానికి ఎంతో కృషి చేశారని సంబంధిత విద్యాధికారులు తెలియజేశారు.

## కామ్రేడ్ ఎం.వి.రమణ మరణం తీరనిలోటు

**పుట్టపర్తి, ఆగస్టు 08, ప్రభాతవార్త**

సిపిఐ సీనియర్ నాయకులు, కమ్యూనిజం సిద్ధాంతాలకు చిరునామగా పిలువబడే కామ్రెడ్ ఎం.వి.రమణ మరణం ఉమ్మడి శ్రీసత్యసాయి, అనంతపురంజిల్లాల వామపక్ష ఉద్యమాలకు తీరని లోటని సిపిఐ జిల్లా సమితి సభ్యులు అడపాల వేమనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కమ్యూనిస్టు కురువృద్ధుడైన కామ్రెడ్ నీలం రాజశేఖర్ రెడ్డి , ఐదుకళ్ళు సదాశివణ్ వంటి మహనీయుల నాయకత్వంలో విశాఖ ఉక్కు ఉద్యమంలో కన్వీనర్‌గా నాయకత్వం వహించారని, రాయలసీమ జిల్లాల్లో సాగునీరు, త్రాగునీరు ప్రాజెక్టులకై పాదయాత్రలతో ఉద్యమాలు నడిపారని, నిరాడంబర జీవితాన్ని గడిపి అనేక మందికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన అడుగుజాడల్లో కమ్యూనిష్టు ఉద్యమాన్ని ముందుకు తీసుకెళతామన్నారు. ఆయన మరణం పట్ల శ్రీసత్యసాయిజిల్లా కమ్యూనిష్టు పార్టీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తోందని, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## ఏకగ్రీవంగా విద్యాకమిటి ఛైర్మెన్, వైస్ ఛైర్మెన్ల ఎన్నిక

**గుమ్మఘట్ట, ఆగస్టు 08 ప్రభాతవార్త**

మండలంలో ఉన్న అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యా కమిటి ఛైర్మెన్లు, వైస్ ఛైర్మెన్లను గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎంఈఓ రామచంద్ర తెలిపారు. మండలంలో మొత్తం 57పాఠశాలలకు విద్యా కమిటి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు మండలం మొత్తంగా ప్రశాంత వాతావరణంలో ఏకగ్రీవంగా ముగిశాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యా కమిటి సభ్యులుగా అధికార పార్టీకి చెందిన వారు అధిక సంఖ్యలో కమిటి సభ్యులను కైవసం చేసుకోవడంతో అధ్యక్షులు, ఉపాధ్యక్షులుగా అధికార పార్టీకి చెందిన వారే ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. మండలంలో 57పాఠశాలల్లో 57మంది పాఠశాల విద్యా కమిటి అధ్యక్షులు మరో 57మంది ఉపాధ్యక్షులు పధవులను కైవసం చేసుకున్నారు. అనంతరం అధికారులు ఎన్నికైన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. దీంతో మండలంలో మొత్తం ఎన్నికైన విద్యా కమిటి ఛైర్మెన్లను, వైస్ ఛైర్మెన్లను తెదేపా నాయకులు ఘనంగా సత్కరించారు.

## కామ్రేడ్ ఎంవి.రమణ పోరాటం మరువలేనిది

**ధర్మవరం రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త**



నివాళులు అర్పిస్తున్న టిడిపి నేతలు

కమ్యునిస్టు యోధుడు, సిపిఐ సీనియర్ నాయకులు మాలపాటి వెంకటరమణ, మృతి అనంతపురం జిల్లాకు తీరని లోటు అని ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. 82 సంవత్సరాల వయస్సులో ఆయన అనారోగ్య విషయం తెలుసుకున్న అనంతపురంలోని రామ్ నగర్‌లోని ఎంవి.రమణ ఇంటికి వెళ్లి.. ఆయన పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మా తాత పరిటాల శ్రీరామ్, నాన్న పరిటాల రవీంద్రతో ఆయనకు మంచి సంబంధాలు ఉండేవని గుర్తు చేసుకున్నారు. అనంతరం మృతిపట్ల ఆయన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.

## ప్రశాంతంగా విద్యా కమిటీ ఎన్నికలు



ఎన్నికైన వారిని సత్కరిస్తున్న దృశ్యం

**ధర్మవరం రూరల్, ఆగస్టు 8 ప్రభాతవార్త**

ధర్మవరం మండల వ్యాప్తంగా ప్రైమరీ హై స్కూల్‌లో పాఠశాలలలో గురువారం 100 విద్య కమిటీల ఎన్నిక కొన్ని ఏకగ్రీవంగాను మరికొన్నిఎన్నిక జరిగాయనిఎన్నికైన ప్రతి ఒక్కరితోనూ ప్రతిజ్ఞ చేయించినట్లు మండల విద్యశాఖ అధికారి గోపాల్‌నాయక్ తెలిపారు. విద్యా కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ప్రజాస్వామ్య బద్ధంగా జరిగాయి. మండల పరిధిలోని మహాత్మా జ్యోతిరావు పూలే బిసి వెల్ఫేర్ పాఠశాల రేగాటిపల్లి పాఠశాల మాత్రం కోరం లేకపోవడం వల్ల విద్యా కమిటీ ఎన్నిక వాయిదా పడిందని ఎంఈఓ తెలిపారు. మిగిలిన అన్ని ప్రాంతాలలో ఎన్నికలకు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు అధికారులకు మండల విద్యాశాఖ అధికారి గోపాల్‌నాయక్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ క్రమంలో భాగంగానే ఎల్‌సికె పురం 25వ వార్డులో భీమనేని ప్రసాద్, మాధవరెడ్డి, ప్రధానోపాధ్యాయులు యజ్ఞన్న ఎన్నికైన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## హైస్కూల్ కమిటీ ఛైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం



హై స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీని ఎంపిక చేస్తున్న దృశ్యం

**బ్రహ్మసముద్రం, ఆగస్టు 8 ప్రభాతవార్త**

బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ ఎన్నిక జరిగింది. పాఠశాలకు అందుబాటులో ఉన్న మూడవ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నికలలో బి అల్లాబకాష్ ఛైర్మన్‌గా, బిపి గౌరమ్మ వైస్ ఛైర్మన్‌గా ఎన్నికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రమౌళి తెలియజేశారు. కార్యక్రమంలోజడ్పిటిసి ప్రభావతి, టిడిపి మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, గ్రామ క మిటీ అధ్యక్షులు వడ్డే వెంకటేష్, మాజీ ఉప సర్పంచు పరమేష్, టిడిపి యువ నాయకులు జి.శివారెడ్డి, జి.మోహన్‌రెడ్డి, మాజీ ఎంపిపి మంజుల, వన్నూరుస్వామి, ఐటిడిపి మండల కోఆర్డినేటర్ ఎం.లోకేష్, బ్రహ్మసముద్రం గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు

**గుడిబండ, ఆగస్టు 8 ప్రభాతవార్త**



పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తున్న దృశ్యం

గుడిబండ మండల వ్యాప్తగా జరిగిన పాఠశాల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు మండల విద్యాధికారి రవిచంద్ర కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 72 పాఠశాలల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా పాఠశాల కమిటీ ఎన్నికలు సజావుగా జరిగాయని అన్నారు. అలాగే గుడిబండ పాఠశాల ఛైర్మన్‌గా సుధాకర్, వైస్ ఛైర్మన్‌గా, రాళ్లపల్లి పాఠశాల ఛైర్మన్‌గా రంగనాథ్, కొంకల్లు పాఠశాల ఛైర్మన్‌గా హనుమేష్, చిగతుర్పి పాఠశాల ఛైర్మన్‌గా మహాలింగప్ప, కెజిఎన్ పాళ్యం పాఠశాల ఛైర్మన్గఆ నేత్రావతి తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రవిచంద్రకుమార్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మారెమ్మ దేవత హుండీ లెక్కింపు

**అగళి, ఆగస్టు 8 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన అగళి మారెమ్మదేవత హుండీని గురువారం రోజు లెక్కించారు. హుండీలో భక్తులు 21వేల రూపాయలను వేసినట్లు ఆ హుండీ మొత్తం లెక్కించామని కరణం ప్రకాష్ తెలిపారు.

## ఘనంగా రామ్‌లక్ష్మన్ సోదరుల జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న రామ్‌లక్ష్మన్ సోదరులు

**పుట్టపర్తి రూరల్ ఆగస్టు 08 ప్రభాతవార్త**

పుట్టపర్తి టిడిపి యువనాయకులు రామ్‌లక్ష్మన్ సోదరుల జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.గురువారం పట్టణంలోని హనుమాన్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా పెద్దఎత్తున బాణా సంచా కాలుస్తూ ఆనందం వ్యక్తం చేశారు.వారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పలువురు పట్టణ ప్రముఖులు వారికి శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ,కొత్తపల్లి జయప్రకాష్.పుట్ల గంగాద్రి,సర్వేశ్వర్,కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రభుత్వ కార్యాలయాలకు కొనసాగుతున్న ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్ గుర్తింపు
### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 8 ప్రభాతవార్త

జిల్లా ప్రభుత్వ కార్యాలయాలకు ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్ గుర్తింపు కొనసాగుతోంది. ఇప్పటికే జిల్లాలో ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్ పొందిన మొదటి ప్రభుత్వ కార్యాలయంగా గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం గుర్తింపు పొందగా తాజాగా ప్రణాళిక కార్యాలయం, ఆఫీస్ ఆఫ్ ద డిప్యూటి ట్రాన్స్‌పోర్ట్ కమీషనర్ కార్యాలయం, అనంతపురం - హిందూపురం అర్బన్ డెవల్‌మెంట్ అథారిటీ కార్యాలయాలకు ఐఎస్ఓ 9001:2015 సర్టిఫికెట్ లభించింది. ఈ సర్టిఫికెట్ పొందాలంటే 39 రకాల ప్రమాణాలు అవసరమవుతాయి. ఈ ప్రమాణాలు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మార్గనిర్దేశంలో సిపిఓ అశోక్‌కుమార్, డిటిసి వీర్రాజు, అనంతపురం - హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయం జిల్లా అధికారులు సిద్ధం చేసి సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకోగా ఐఎస్ఓ ప్రతినిధులు వచ్చి అన్ని రకాల ప్రమాణాలు వున్నాయని ఆయా జిల్లా ప్రభుత్వ కార్యాలయానికి సర్టిఫికెట్ జారీ చేయడం జరిగింది. ఆ యా కార్యాలయాలకు ఐఎస్ ఒ 9001:2015 సర్టిఫికెట్‌లను గ్లోబల్ మేనేజ్ మెంట్ సర్టిఫికే షన్ సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ హైదరాబాద్ వారు అందచేశారు. ఈ సందర్భంగా సిపిఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఐఎస్ఓ 9001: 2015 సర్టిఫికెట్ పొందడం సంతోషం గా వుందన్నారు. ఈ సర్టిఫికెట్ పొందడంలో జి ల్లా కలెక్టర్ సూచనలు, సహ కారం, మార్గని ర్దేశతత్వం అందించారన్నారు. గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం తరు వాత ఈ సర్టిఫికెట్ పొందిన ప్రభుత్వ కార్యాలయంగా జిల్లా ప్రణాళిక కార్యా లయం గుర్తింపు పొందినందుకు జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులకు, జిల్లా ప్రణాళిక కార్యాలయం అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.



సర్టిఫికెట్ అందచేస్తున్న జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి - జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్
### - ప్రతి పాఠశాలలో ఎకో క్లబ్బులు ఏర్పాటు చేసుకోవాలి

పుట్టపర్తి రూరల్ ఆగష్టు 08 ప్రభాతవార్త

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఎకో క్లబ్బులు ఏర్పాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ పేర్కొన్నారు. గురువారం పుట్టపర్తి మండల పరిధిలోని పెదపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

మధ్యాహ్నం భోజనన మెనూపరిశీలించారు. కొంతసేపు పాఠశాల విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారితో కొంత సేపు ముచ్చటించారు. అనంతరం విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ స్వయంగా భోజనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో విద్యా ర్థులకు ఉచితంగా మధ్యాహ్నం పూట భోజన సదుపాయం కలిపంచే ప్రభుత్వ విధానాన్ని మధ్యాహ్న భోజన పథకము అంటారని పేద బాలబాలికలు పేదరికం కారణంగా పాఠశాలకు వెళ్లడం మానివేయకూడదనే ఉద్దేశయంతో అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకం ఇందులో అన్ని పనిదినాలలో విద్యార్థినీ విద్యార్థులకు ఉచితంగా భోజనం పెడతారు. బాలబాలికలను ఆకలి బాధ నుంచి దూరం చేయడం, పాఠశాలలో చేరేవారి సంఖ్యను హాజరు అయ్యేవారి సంఖ్యను పెంచడం, పిల్లల్లో సామాజికి సమభావన పెంపొందించడం, పౌష్టికాహార లోపాన్ని తగ్గించడం, ఈ పథకం యొక్క ముఖ్యఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం పేరు మార్చి న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వంలో గోరుముద్ద పథకాన్ని డొక్కాసీతమ్మ మధ్యా హ్న బడి భోజన పథకంగా మార్చారని, మధ్యాహ్న బడి భోజన పథకానికి పటిష్టంగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రధానో పాధ్యాయులను ఆదేశించారు. పాఠశాల ఆవరణ ములో పెంచిన మొక్కలను, నర్సరీని, పరిశీలించారు. భోజనాన్ని తిని సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే రీతిలో ప్రతిరోజు మెనూ ప్రకారం వండి పెట్టాలని సూచించారు. అనంతరం మెనూ వివరాలు పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలలో ఒక గంట న్యూట్రిషన్ గార్డెన్ పై పిల్లలకు అవగాహన కార్యక్ర మాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ టిఎస్ చేతన్



పిల్లలకు న్యూట్రిషన్ గార్డెన్ పై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ చేతన్

## సెంట్రల్ యూనివర్సిటీ పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

బుక్కరాయసముద్రం ఆగస్టు 8 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మండల పరిదిలోని జంతులూరు గ్రామ సమీపంలో నూతనంగ నిర్మించిన సెంట్రల్ యూనివర్సిటీ నందు పూర్తి అయిన భవనాలను గురువారం నిర్వహించిన పూజకార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ, వారితోపాటు విసి ఎస్‌ఏ కోరి, బుక్కరాయసముద్రం ఎంపీపీ దాసరి సునీత, సెంట్రల్ యూనివర్సిటీ ప్రఫెసర్, జంతులూరు సర్పంచు సుజాతమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగ వారు మాట్లడుతూ ఈ సంవత్సరం పూర్తిఅయిన అకడమిక్ బ్లాక్ బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్ భవ నాలను పరిశీలించారు. కేంద్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలసి యూనివర్శిటీకి కావలసి న సహాయ సహాకారాలు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు సహాకారంతో మరిన్ని పనులను పూర్తి చేస్తామని హామి ఇచ్చారు. గత టిడిపి ప్రభుత్వంలోనే కరువు జిల్లా మన అనంతపురం జిల్లాకు సెంట్రల్ యూనివర్సిటీ తీసు కరావడం జరిగిందన్నారు.



సెంట్రల్ యూనివర్సిటీ భవనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ

## నన్నేడిగేదెవరు..అంతా నా ఇష్టం..!

యాడికి(తాడిపత్రి), ఆగస్టు 8, ప్రభాతవార్తః యాడికి మండలం రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎల్‌డీసీ తీరుతో సిబ్బంది నరకయాతన అనుభవిస్తున్నారు. అంతా నా ఇష్టం నన్నేడిగేదెవరు అన్నట్లు వ్యవహరిస్తున్న అతని తీరుతో పీహెచ్‌సీ సిబ్బంది విసిగిపోయారు. వేతనాల బిల్లుల విషయంతో పాటు ఇతర అలవెన్సులకు సంబంధించిన బిల్లులను సకాలంలో ఉన్నతాధికారులకు అందచేయడంలో కీలక పాత్ర పోషించే ఎల్‌డీసీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా వైద్యాధికారులు గాని, జిల్లా వైద్యాధికారులు గాని ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. పీహెచ్‌సీ సిబ్బంది ఎస్ఆర్‌లు కూడా ఎల్‌డీసీఆధీనంలో ఎక్కడో ఉంచడం, వాటిలో పొందుపరచాల్సి న వివరాలను సక్రమంగా పొందుపరచకపోవడంతో తమ విలువైన ప్రభుత్వ ప్రోత్సహకాలను కోల్పోతున్నామని సిబ్బంది వాపోతున్నారు. ఎవరైనా సిబ్బంది ఇలాగైతే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తే మీరు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా అంటూ స్థానికంగా లేని ఎల్‌డీసీ వైద్యాధికారి మాదిరి బెదిరి ంపు ధోరణిలో మాట్లాడటం, ఇదంతా చూస్తూ వైద్యాధికారులు మిన్నకుండి పోవడం చర్చనీయాంశంగా మారింది. ఇంత గందరగోళ పరిస్థితి నెల కొన్నా జిల్లా వైద్యాధికారు లు ఏ మాత్రం పట్టించుకోక పోవడం విమర్శలకు దారితీ స్తోంది. ఈ విషయంపై రాయలచెరువు పీహెచ్‌సీ వైద్యాధికారి దేవరాజన్ స్పం దిస్తూ ఇప్పటికే ఎల్‌డీసీ తీరుపై రెండు సార్లు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశామని, విచారణ సాగుతోందని తెలిపారు.



ఎల్‌డీసీని మందలిస్తున్న వైద్యాధికారి దేవరాజన్

## ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు పూర్తి

తాడిపత్రి, ఆగస్టు 8, ప్రభాతవార్తః గతంలో రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావించే పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు గురువా రం నియోజ కవర్గ వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిశాయి. తెదేపా, వైకాపా మధ్య పోటాపోటీగా ఉంటాయేమో అనే ఉద్దేశంతో అటు విద్యాధికారులు, ఇటు పోలీసులు ఉత్కంఠతతో ఎదురు చూశారు. చాలా చోట్ల నామమాత్రపు పోటీకీ కూడా వైకాపా ముం దుకు రాకపోవడంతో తెదేపా మద్దతుదారులే ఏకగ్రీవంగా అన్ని చోట్ల కమిటీ చైర్మన్లుగా ఎన్నికయ్యారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్ల ఎన్నికలను తెదేపా నాయకులు ఒక పండుగలా నిర్వహించారు. ప్రధానంగా యాడికి మండలం వేముల పాడు ప్రాథమికోన్నత పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక అమితాసక్తిని కలిగించి ంది. సాధారణంగా ఈ ఎన్నికలు చేతులు ఎత్తి చైర్మన్‌ను సభ్యులు ఎన్నుకుం టారు. కానీ వేములపాడులో రహస్య ఓటింగ్ పద్ధతిని సభ్యులు కోరడంతో అదే పద్ధతిలో ఎన్నిక నిర్వహించారు. 21 మంది సభ్యులున్న ఈ పాఠశాలలో 16 మంది తెదేపా మద్ద తుదారులకు, అయిదుగురు వైకాపా మద్దతు దారులకు ఓటేయడం విశేషం. ప్రజాస్వామ్య పద్ధతిని అవల ంబిం చిన తల్లి దండ్రుల ఆలోచనను అభినందిస్తూ పాఠశాల అభివృద్ధికి సీఐ నాగార్జునరెడ్డి రూ.10 వేలు విరాళంగా అందించడం గమనార్హం. సమస్యాత్మకంగా భావించిన వేములపాడులో కేజీబీవీ, ప్రాథమికోన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంలో కీలక పాత్ర పోషించిన తెదేపా నాయకులు చుక్కలూరు రామచంద్రారెడ్డి, విజయలక్ష్మి, ప్రధానో పాధ్యాయులు నిర్మల, గాయత్రి, రవీంద్ర తదితరులను సీఐ ప్రత్యేకంగా అభినందించారు.



వేములపాడు ప్రాథమికోన్నత పాఠశాల అభివృద్ధికి ఆర్థిక సాయమందిస్తున్న సీఐ నాగార్జునరెడ్డి



యాడికి కేజీబీవీ కమిటీ చైర్మన్‌ను సత్కరిస్తున్న ప్రత్యేకాధికారి నిర్మల, మాజీ సర్పంచి విజయలక్ష్మి

## సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండండి.. జిల్లా ఎస్పీ



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎస్‌పి వి.రత్న

కదరి, ఆగస్టు 8 ప్రభాతవార్త

.సైబర్ నేరాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ వి.రత్న తెలిపారు. గురు వారం కదిరి టౌన్ పోలీ స్‌స్టేషన్ సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పి ంచే విధంగా తయారు చేసిన పోస్టర్లను ఎస్పీ, అదనపు ఎస్పీ, డిఎస్పీలతో కలిసి విడుదల చేశారు. ట్రేడింగ్ మోసాలు, నకిలీ పోలీసులు, ఆన్‌లైన్ ట్రేడింగ్, సైబర్ క్రైమ్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ ఫిర్యాదులు కోసం 1930కి డయల్ చేసిన ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎన్.విష్ణు, డిఎస్‌పి శ్రీలత, సిఐలు వెంకటేశ్వర్లు, పుల్లయ్య, మోహన్, ఎస్ఐలు, బాబ్జాన్, బాలరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు. .

## ఉద్యాన పంటలను నమోదు చేసుకోండి..హెచ్చ్‌ఓ శైలజ

బుక్కరాయసముద్రం ఆగస్టు 8 ప్రబాతవార్త

బుక్కరాయసముద్రం మండల వ్యాప్తంగ రైతులు ఖరీఫ్ సాగులో సాగుచేసిన ఉద్యాన పంటలను ఆయాగ్రామాల రైతు సేవా కేంద్రంలో నమోదు చేసుకోవాలని మండల హెచ్చ్ఓ శైలజ తెలిపారు. గురువారం మండల పరిదిలోని పసులూరు, కొత్తపల్లి, రేకులకుంట, గ్రామాలో పర్యటించి రైతులు సాగుచేసిన పంటలను నమోదు చేయడమైనది. ఈ సందర్బంగ రైతులతో వారు మాట్లడుతూ పంటలను నమోదు చేసుకోవడంతో ప్రభుత్వం నుండి వచ్చే ఇన్పుట్ సబ్సిడి, ఇన్సూరెన్స్, అకాల వరానఝులు, ఈదుర గాలుల వలన పంటనష్ట పరిహారాలు, పంటల మీద బ్యాంకు రుణాలు పొంద వచ్చు నన్నా రు. నమోదు చేసుకొనే రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్, తో ఆయా గ్రామాల రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలన్నారు. దీర్ఘకాలిక ఉద్యాన పంటలను గత ఏడాది పంట నమోదైన పంటలను ఆటోమేటిక్గా ఫార్వర్డ్ చేయాలని రైతు సేవా సిబ్బందికి ఆదేశాలు జారిచేయ డమైనది. ఎంఐడిహెచ్ 2024 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా నాటిన చీని, మామిడి, జామ, బంతిపూల తోటలను సందర్శిం చడమైనది. ఈ కార్యక్రమంలో ఉద్యానాదికారి శైలజ, తో పాటు వ్యవసాయశాఖ సిబ్బంది అనూష, నదియా, జోష్ణ, మునికు మార్ రైతులు పాల్గొన్నారు.



ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న మండల అధికారి శైలజ

## ప్రశాంతంగా ముగిసిన స్కూల్ కమిటీ ఎన్నికలు

శింగనమల, ఆగస్టు 8 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా గురువారం స్కూల్ కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. మొత్తం మండల వ్యాప్తంగా పాఠశా లలకు స్కూల్ కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఎంపిపిఎస్ ఏకుల నాగేపల్లి చైర్మన్ యమున, వైస్ చైర్మన్ ధనుంజయనాయక్, ఎంపిపిఎస్ కల్లుమడి చైర్మన్ గంప్ప, వైస్ చైర్మన్ బి.లక్ష్మి, ఎంపియుపిఎస్ గుమ్మేపల్లి చైర్మన్ శ్రీనివాసులు ఆచారి, వైస్ చైర్మన్ గౌతమి, ఎంపిపిఎస్ తరిమెల చైర్మన్ నారాయణస్వామి వైస్ చైర్మన్ ఎం.అనిత, ఎంపిపిఎస్ తరిమెల ఎస్‌సి చైర్మన్ ఎం.శ్రీని వాసు లు, వైస్ చైర్మన్ లావణ్య, జడ్పిహెచ్ఎస్ తరిమెల చైర్మన్ ఎం.మహేష్, వైస్ చైర్మన్ అలివేలమ్మ, నిదనవాడ ఎంపిపిఎస్ చైర్మన్ లలిత మ్మ, వైస్‌చైర్మన్ నాగమ్మ, ఎంపిపిఎస్ నిదనవాడ ఎస్సీ చైర్మన్ కె.నరేష్, వైస్‌చైర్మన్ వై.నాగే శ్వరమ్మ, ఎంపియుపిఎస్ ఆనందరావుపేట చైర్మన్ కె.సూర్యనా రాయణమ్మ, వైస్ చైర్మన్ జి.శివమ్మ, ఎంపిపిఎస్ రాచేపల్లి చైర్మన్ ఎం.శీన, వైస్ చైర్మన్ షహింతాజ్, ఎంపిపిఎస్ ఇరువెందుల ఎస్‌టి చైర్మన్ గంగరాజు, వైస్‌చైర్మన్ ఎం.రామాంజినమ్మ, అలంకరాయునిపేట చైర్మన్ కె.సుమలత, వైస్‌చైర్మన్ ఎం.వెలసమ్మ, ఎంపిపిఎస్ రాచేపల్లి ఎస్సీ చైర్మన్ ఎస్.వనజ, వైస్‌చైర్మన్ మల్లయ్య, ఎంపిపిఎస్ ఉల్లికల్లు చైర్మన్ టి.ఆదినారాయణమ్మ, వైస్ చైర్మన్ సి.కంబగిరి, ఎంపిపిఎస్ కొరివిపల్లి చైర్మన్ పి.శ్రీనివాసులు, వైస్ చైర్మన్ సుకన్య, ఎంపిపిఎస్ శిలేపల్లి చైర్మన్ టి.శ్రావణి, వైస్ చైర్మన్ వై.నారా యణస్వామి, ఎంపిపిఎస్ పి.జలాలపురం చైర్మన్ ఎస్.శాంతి, వైస్ చైర్మన్ సోమేశ్వర్, ఎంపియుపిఎస్ జులాకాలువ చైర్మన్ టి.మునీంద్ర, వైస్ చైర్మన్ అరుణ, ఎంపిపిఎస్ సలకం చెరువు ఎస్సీ చైర్మన్ ఎం.నల్లమ్మ, వైస్ చైర్మన్ భూలక్ష్మి, ఎంపిపిఎస్ సలకం చెరువు చైర్మన్ బి.ఛాంద్‌బి, వైస్‌చైర్మన్ రామాంజినేయులు, ఎంపిపిఎస్ నాయినవారిపల్లి చైర్మన్ జి.అంబిక, వైస్ చైర్మన్ రామాంజినేయులు, జడ్పిహెచ్ఎస్ సలకం చెరువు చైర్మన్ ఎం.సూర్య నారాయణ, వైస్ చైర్మన్ శివ పద్మిని లీలా, ఎంపిపిఎస్ నాగలగుడ్డం చైర్మన్ బి.రామచంద్ర, వైస్ చైర్మన్ జి.అనిత, ఎంపి తాండ చైర్మన్ జె.దామోదర్, వైస్ చైర్మన్ పి.రమాదేవి, సిజలాలపురం ఎంపిపిఎస్ చైర్మన్ కె.నారాయణమూర్తి, వైస్ చైర్మన్ కె.కవిత, ఎంపిపిఎస్ గురుగుంట్ల ఎస్సీ చైర్మన్ వి.భాగ్యశ్రీ, వైస్ చైర్మన్ వి.భవాని, ఎంపిపిఎస్ వెస్ట్ నర్సాపురం చైర్మన్ బి.గంగాధర్, వైస్ చైర్మన్ కె.లక్ష్మి, ఎంపిపిఎస్ గురుగుంట్ల చైర్మన్ కె.ఓబుళపతి, వైస్ చైర్మన్ జె.లక్ష్మిలను ఎన్నుకున్నారు. గుమ్మేపల్లి గ్రామంలో గ్రామ సర్పంచు దేగల లలితమ్మ, జిల్లా తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దేగల కృష్ణమూర్తి, స్కూల్ ఉపాధ్యాయులు సమక్షంలో స్కూల్ కమిటీ చైర్మన్‌గా శ్రీనివాస్ ఆచారిని, వైస్ చైర్మన్ గౌతమిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో దేగల శ్రీనివాసులు, ప్రవీణ్‌కుమార్, శివయ్య, బ్రహ్మ ఆచారి, అమర్‌నాథ్, వెంకటేష్, జి.కృష్ణమూర్తి, మల్లికార్జున, నాగభూషణ, రామాంజినేయులు, కురుబ నల్లప్ప, లక్ష్మినాథ్, దేగల కిరణ్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యారు_ తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గుమ్మేపల్లి స్కూల్ కమిటీ సభ్యులతో దేగల కృష్ణమూర్తి

## విద్యార్థులు డ్రగ్స్ బారిన పడొద్దు
### - డ్రగ్స్ వాడితే భవిష్యత్తు చిత్తే - విద్యార్థులు స్నేహపూర్వకంగా మెలగాలి

అనంతపురం, ఆగస్టు 8 ప్రభాతవార్త ప్రతినిధి

జిల్లా న్యాయ సేవా సంస్థ, మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్యరావు అధ్యక్షతన వైద్య కళాశాలలోని సుశ్రుత హాలులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల నిరోధకము, మహిళల అక్రమ రవాణా నిరోధ కము, ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు శిరస్త్రాన ధారణ వంటి వాటిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి జి.శివ ప్రసాద్ యాదవ్, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ రిటైర్డ్ జడ్జి కె.శ్రీనివాసరావు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్యరావు, ప్రభుత్వ సర్వజన వైద్యశాల పర్యవేక్షకులు డాక్టర్ కె.ఎస్ఎస్ వెంకటేశ్వరరావు, సీనియర్ న్యాయవాది ఎన్.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలు మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ భారిన పడకుండా, విలువైన జీవితాన్ని పాడు చేసుకోకుండా, సంస్కారవంతమైన జీవితం గడపాలని తెలిపారు. మహిళల అక్రమ రవాణా కూడా అత్యంత నేరమని, దీని పట్ల అందరూ అవగాహన కలిగి ఉండాలని, ద్విచక్ర వాహనాన్ని నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని తెలిపారు. సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్‌కి పాల్పడకుండా స్నేహ పూర్వక వాతావరణంలో అందరి తో కలిసి మెలిసి ఉండాలని తెలిపారు. లేకపోతే చట్టాలు తన పని తాను చేయకపోతే అని, జైలు శిక్ష విలువైన విద్యార్థి జీవితం నాశనం చేసుకోకుండా మంచి అలవాట్లతో విద్యార్థి జీవితాన్ని గడపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా, డాక్టర్ నవీన్, ప్రొఫెసర్లు డాక్టర్ శంకర్, డాక్టర్ రామస్వామి, డాక్టర్ దుర్గ, డాక్టర్ రవి కుమార్, డాక్టర్ వైద్యనాథ్, డాక్టర్ సరళ, డాక్టర్ రేణుక, డాక్టర్ షబానా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆదిరెడ్డి, పరదేశీనాయుడు, పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు, ఎంబిబిఎస్ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్యరావు

## ఎస్సీ వర్గీకరణను తక్షణం అమలు చేయాలి
### - ఎంఈఎఫ్ జాతీయ అధ్యక్షులు ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 8 ప్రభాతవార్త

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తక్షణం వర్గీకరణ అమలు చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జాతీయ అధ్యక్షులు ఆచార్య చిలుమూరు శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలో ఉపాధ్యాయ భవన్‌లో బుధవారం సాయంత్రం మాదిగ ఉద్యోగుల సమాఖ్య అనంతపురం జిల్లా అధ్యక్షులు మన్నెపాకుల రమేష్ అధ్యక్షతన ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అతిథులుగా జాతీయ అధ్యక్షులు ఆచార్య చిలుమూరు శ్రీనివాసరావు, జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి బండారు శంకర్ హాజరై మాట్లాడుతూ.. ఈనెల 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన వెంటనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ ఎస్సీ వర్గీకరణను తక్షణం చేస్తామని ప్రకటించారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపా ధ్యక్షులు ఎల్లప్ప గంగాధర్, జాతీయ కార్యవర్గ సభ్యులు సాకే అమర్‌నాథ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి.శివకుమార్, రాష్ట్ర గౌరవ సలహాదారులు డాక్టర్ న్యామద్దల నరసింహులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉలవల నాగరాజు, ఆచార్య లక్ష్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు నాగేంద్ర, కోశాధికారి దేవర పుల్లన్న, జిల్లా ఉపాధ్యక్షులు హను మంతరావు, కిష్టప్ప, శ్రీనివాసులు, మల్లికార్జున, ఎస్కెయు అసిస్టెంట్ రిజి స్ట్రార్ ఆనంద్‌రాజు, ఎంఈఓలు గురు ప్రసాద్, సాకే ఓ బుళపతి, నగర అధ్య క్షులు మీసాల నాగబూషణ, నగర ప్రధాన కార్యదర్శి కొడవండ్ల నారా యణస్వామి, మాదిగ విద్యార్థి నేతలు వేమన్న, మంజు, రాఘవ, సోమశేఖర్ తదిత రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆచార్య చిలుమూరి శ్రీనివాసరావు

## ఈ క్రాఫ్ నమోదుకు తుది గడువు సెప్టెంబర్ 15
### జిల్లా వ్యవసాయాదికారి ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం ఆగస్టు 8 ప్రభాతవార్త

జిల్లా లోని ఖరీఫ్‌సాగులో రైతులు సాగుచేసిన పంటలను తప్పని సరిగ ఈ క్రాఫ్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అన్నారు. గురువారం బుక్కరాయసముద్రం మండలంలోని దయ్యాలకుంటపల్లి గ్రామాల్లో ఈ క్రాఫ్ పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్బంగ వారు మాట్లడుతూ ఈ క్రాఫ్ నమోదుకు తుది గడువు సెప్టెంబర్ 15న గడువు ముగుస్తుందన్నారు. నెలరోజుల వ్యవదిలో సామాజిక మాధ్యమాల ద్వారా గ్రామాల్లో దండోరా వేయించి ఆయా గ్రామాల్లో రైతుసేవా కేంద్రం వద్ద నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం పంటలను నమోదు చేసుకున్నవాటిని సామాజిక తనిఖీ సెప్టెంబర్ 19నుండి 24 వరకు ఉంటుందన్నారు. 24న ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. 28న తుదిజాబిత తయారుచేసి 30 సెప్టెంబర్ రైతు సేవాకేంద్రం, గ్రామ సచివాలయాల్లో నమోదు చేసుకున్న రైతుల జాబితాను ఉంచడం జరుగుతుందన్నారు. కౌవులు భూములు తీసుకున్న రైతులు పంట సాగు హక్కు పత్రాలను పొందవలెను ఈ పత్రా లను గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా పొందాల న్నారు. వాటి ద్వారా పంటల కొను గోళ్లు, పంట నష్ట పరిహా రం, ప్రకృతి వైపరీత్యాలద్వార పంట నష్టపోయినపుడు నష్టపరి హారం, ఇన్సూరెన్సు పొందవ చ్చును. ఈ కార్యక్రమ ంలో మండల వ్యవసాయాదికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి నరేష్, రైతులు తదితిరులు పాల్గొన్నారు.



పంట పొలాలను పరిశీఇస్తున్న జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ

## రీప్యాట్రేషన్ అయిన క్లర్కులకు పోస్టింగులు
### - వారి స్థానంలో మరో ఇద్దరు సమగ్ర శిక్షకు - అందులో ఒక్క క్లర్క్‌కు మూగ, చెవిటి

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 8 ప్రభాతవార్త

జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో పని చేస్తూ ఇటీవల రీప్యాట్రేషన్ అయిన ఇద్దరు క్లర్క్‌లకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోనే పోస్టింగ్ ఇస్తూ డీఈఓ బి.వరలక్ష్మి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వారి స్థానంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు షబీనా, మధుసూధన్‌రావులను ఫారిన్ కింద సమగ్ర శిక్ష కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అయితే ఒక సీనియర్ అసిస్టెంట్ మధుసూధన్ రావుకు మూగ, చెవిత ఉంది. అలాంటి క్లర్క్‌ని పని ఎక్కువగా ఉండే సమగ్ర శిక్ష కార్యాలయంలో పోస్టింగ్ ఇవ్వడం పలు విమర్శలకు దారితీస్తోంది. అయితే ఆ క్లర్క్ సమగ్ర శిక్షలో జాయిన్ అవ్వడానికి అయిష్టత చూపుతున్నట్లు సమాచారం. మిగిలిన క్లర్కులందరూ నాట్ విల్లింగ్ ఇవ్వడంతో ఆ ఇద్దరు క్లర్కులను విల్లింగ్ ఆగకుండా ఫారిన్ సర్వీస్‌లో పోస్టింగ్ ఇచ్చారని ఉద్యోగులు చర్చించుకుంటున్నాం. ఆ ఇద్దరు క్లర్కులను కానీ రిప్యాట్రేషన్ చేసి పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వాల్సిన బాధ్యత డిఈఓదే. కానీ వారిని కలెక్టర్‌తో రిజిస్టే చేయించినప్పటికీ పోస్టింగ్ ఆర్డర్స్ డీఈఓ ఇవ్వడం గమనార్హం. రీప్యాట్రేషన్ అయి రిపోర్టు చేసుకొని వారం రోజులుగా పోస్టింగుల కోసం ఎదురు చూస్తున్న టీచర్లకు డీఈఓనే పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంది. కానీ డీఈఓ జిల్లా కలెక్టర్‌కు ఫైలు పంపించడం గమనార్హం. ఆ ఇద్దరు క్లర్కులకు డీఈఓ తమ పేరుతో ఉత్తర్వులు ఇచ్చారు. కానీ టీచర్లకు ఎలాంటి పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వకుండా జిల్లా కలెక్టర్‌కు ఫైలు పంపించిన డీఈఓ తీరును పలు ఉపాధ్యాయ సంఘాలు తప్పు పడుతున్నారు.

## ప్రసిద్దిగాంచిన హెరిటేజ్ ఫుడ్స్
### - టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్ - పామిడిలో హెరిటేజ్ హ్యాపీనెస్ పాయింట్ ప్రారంభం

పామిడి, ఆగస్టు 08 ప్రభాతవార్త

విదేశాల్లోనూ వ్యాపార కార్యకళాపాలను కొనసాగిస్తూ ప్రసిద్దిగాంచిన హెరిటేజ్ ఫుడ్స్ ప్రధాన కార్యాలయం భారంతదేశంలోని హైదరాబాద్‌లో ఉండటం గర్వించదగ్గ విషయం అని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని స్టేట్‌బ్యాంకు వద్ద కట్టకిందపల్లికి చెందిన పెరుమసాని రామాంజనేయులు నిర్వాహకులుగా నెలకొల్పిన హెరిటేజ్ హ్యాపీనెస్ పాయింట్‌ను గురువారం టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకట శివుడు యాదవ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షణ భారంతదేశంలో అతిపెద్ద ప్రైవేట్ రంగ డెయిరి ఎంటర్‌ప్రైజెస్‌లో హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ ఒకటి అన్నారు. 1992లో హెరిటేజ్ గ్రూపును తెలుగుదే శంపార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు స్థాపించారని తెలిపారు. నిర్వా హకులు పెరుమసాని రామాంజనేయులు మాట్లాడుతూ హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్‌ను హెరిటేజ్ ఫుడ్స్ అని పిలుస్తా రంటూ హెరిటేజ్ పాల ఉత్పత్తుల శ్రేణిలో పాలు, పెరుగు, మజ్జిగ, ఐస్‌క్రీం, ఫ్లేవర్డ మిల్క్, డైరీవై ట్‌నర్, స్కిన్ మిల్క్ పౌడర్ ఉన్నాయని వెల్లడించారు. ఈకార్య క్రమంలో టిడిపి, జనసే నపార్టీ, బిజేపి నాయకులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



హెరిటేజ్ హ్యాపీనెస్ పాయింట్‌ను ప్రారంభిస్తున్న వెంకటశివుడుయాదవ్